ఇచ్చి 'పుచ్చుకుంటున్నారు'



బేల మండలం ఇంద్రానగర్‌కు చెందిన ఇతడి పేరు సిరాజ్. వేసవిలో భార్యతోపాటు చేసిన కూలీ పనికి వచ్చిన రూ.12 వేల డబ్బులు అధికారులు చెల్లించటం లేదు. ఇతడిలా ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లోని పేదల గోడును అధికారులు పట్టించుకోవడం లేదు. అక్రమాలను సైతం పారదర్శకంగా ఉన్నట్లు నమ్మించటంలో సిద్ధహస్తులైన కొంత మంది అధికారులు, సిబ్బంది కారణంగా పనుల నిర్వహణ అంతా ఆగమాగంగా ఉంది. రోజు కూలీ రూ.300 దక్కేలా పనులు చూపించాల్సి ఉంది. నిర్మల్ జిల్లాలో సగటు కూలీ రూ.218, ఆదిలాబాద్ జిల్లాలో రూ.238కే పరిమితం చేయటం కూలీల పాలిట శాపంగా మారుతోంది.

◆ ఆదిలాబాద్ గ్రామీణ మండలం లోకారి, అంకోలి గ్రామాల శివారులో కాకుండా 5 కి.మీ దూరంలో పనులు చూపించిన విషయం జిల్లా అదనపు డీఆర్‌డీవో కుటుంబరావు దృష్టికి వచ్చినప్పటికీ పట్టించుకోలేదు. పని కావాలని మొరపెట్టుకున్నా.. కూలీల గోడు వినలేదు.

● సామాజిక తనిఖీల్లో వెలుగు చూడని అవినీతి తతంగం

ఈటీవీ ఆదిలాబాద్

ఉమ్మడి జిల్లాలో ఉపాధి హామీ పథకం అమలు గాడి తప్పుతోంది. అధికారుల పర్యవేక్షణలోపంతో పనుల నిర్వహణ అక్రమాలకు దారి తీస్తోంది. జిల్లాకు ప్రత్యేకంగా అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి(అడిషనల్ డీఆర్‌డీవో) ఉన్నప్పటికీ పనుల నిర్వహణలో పారదర్శకత కనిపించటం లేదు. పైగా కొంతమంది అధికారులు సామాజిక తనిఖీల్లో బయట పడకుండా ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో వ్యవహరిస్తుండటంతో ఈ అవినీతి తతంగం వెలుగు చూడటం లేదు. ఫలితంగా క్షేత్రస్థాయిలో జరిగే విషయాలు ఉన్నతాధికారుల దృష్టికి రావటం లేదు. కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది ఒక్కొక్కరికి రోజు కూలీ రూ.300 నిర్ణయించినప్పటికీ రూ. 250 దాటలేదు.

ఆదివాసీలకు అన్యాయం

ఆసిఫాబాద్ జిల్లాలో చోటు చేసుకున్న అక్రమాలు బయటకు పొక్కకుండా క్షేత్రస్థాయిలో సర్దుబాటు చేసే ప్రయత్నం జరుగుతున్నట్లు ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లింది. ఆదివాసీల అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని కొంత మంది సిబ్బంది బినామీ వ్యక్తుల పేరిట లబ్ధి పొందే దందా సాగుతోంది. ఇటీవల ఆసిఫాబాద్ మండలంలో 27 పంచాయతీలు ఉంటే 19 పంచాయతీల పరిధిలోని పనుల్లో రూ.3,68,900 నిధులు దుర్వినియోగం అయినట్లు తేలింది. జిల్లాలోని 15 మండలాల్లోని 335 పంచాయతీల పరిధిలోని అక్రమాలను సర్దుబాటు చేసే ప్రయత్నం జరుగుతోంది. కూలీల్లో అత్యధికులు ఆదివాసీలే కావటంతో అధికారులు చెల్లించిందే వేతనం అన్నట్లు నమ్మించే ప్రయత్నం జరుగుతోంది.

మంచిర్యాలలో ఇలా..

మంచిర్యాల జిల్లాలో కూలీలకు పనులు చూపించడానికంటే నేతల సిఫారసులకే అధికారులు ప్రాధాన్యమిస్తున్నారనే ఆరోపణలు వినవస్తున్నాయి. సింగరేణి ప్రాంతమైనందున కూలీ పనులకు గ్రామీణులు ముందుకురారని నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు సైతం పట్టించుకోకపోవటం అధికారులకు కలిసి వస్తోంది. కోటపల్లి మండలంలోని 31 పంచాయతీల్లో రూ.5.01 కోట్ల పనులు జరిగితే రూ.4.84 కోట్ల చెల్లింపులు జరిగినట్లు తేలింది. మరో రూ.17,72,917 తేడాలున్నట్లు దృష్టికిరాగా రూ.26,116 రికవరీకి ఆదేశించారు. చెన్నూరు మండలంలోని 30 పంచాయతీల పరిధిలో దుర్వినియోగమైన రూ.51 వేలు రాబట్టినట్లు నివేదికలు తయారు చేయటం అధికారుల పనితనాన్ని వెల్లడిస్తోంది.

జిల్లాల వారీగా వివరాలు.. (■ మండలాలు ■ పంచాయతీలు)

జిల్లా	మండలాలు	పంచాయతీలు
ఆదిలాబాద్	17	473
నిర్మల్	18	400
ఆసిఫాబాద్	15	335
మంచిర్యాల	16	311

నేటి నుంచి తెలంగాణ ఉద్యమకారుల పాదయాత్ర

ఎదులాపురం, న్యూస్‌టుడే: తెలంగాణ ఉద్యమకారులను ఆదుకోవాలన్న డిమాండ్‌తో నేటి నుంచి పాదయాత్రను ప్రారంభిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ తెలిపారు. స్థానిక పాత్రికేయ ప్రాంగణంలో సోమవారం మాట్లాడుతూ ఆదిలాబాద్ నుంచి ఉదయం 9 గంటలకు యాత్రను ప్రారంభించి ఉస్మానియా విశ్వవిద్యాలయం వరకు కొనసాగించనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులను ఆదుకోవాలని కోరారు. ప్రధాన కార్యదర్శి నిమ్మల నరేందర్, శ్రీరామోజీ ఆంజనేయులు, ఎండీ రఫీక్, సుజాత్ అలీ, చాకటి కిరణ్, పూసం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

చదువుకుందాం... రండి

భీంపూర్, న్యూస్‌టుడే : నేటి యువతలో పఠనాసక్తిని పెంచేలా ప్రభుత్వ డిగ్రీ కళాశాల సహాయ ఆచార్యులు రడాపు సంతోష్‌కుమార్ సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. చదువుకుందాం రండి పేరిట కథలు, పోటీ పరీక్షల పుస్తకాలను ప్రత్యేక గదిలో అందుబాటులోకి తెచ్చారు. ఈ కార్యక్రమాన్ని టీజీసిజీటీఏ జిల్లా కార్యదర్శి నర్సింగ్ రావు ప్రారంభించారు. అధ్యాపకుడి చొరవను పలువురు అభినందించారు.

ఇందిరమ్మ కమిటీలపై కసరత్తు

● గృహ నిర్మాణ లబ్ధిదారుల ఎంపికలో వారిదే కీలకపాత్ర

ఆదిలాబాద్ అర్బన్, న్యూస్‌టుడే

ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు క్రియాశీలక పాత్ర పోషించిన ఇందిరమ్మ కమిటీలు మళ్లీ తెరపైకి వచ్చాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ కమిటీలను ప్రతి పంచాయతీలో, బల్దియాలో ప్రతి వార్డులో ఏర్పాటు చేయాలని ఉత్తర్వులు జారీ చేసింది. గత శనివారమే కమిటీలను పూర్తి చేసి పంపాల్సి ఉంది. అయితే దసరా పండగ, ఆదివారం సెలవులు ఉండటంతో సాధ్యపడలేదు. గ్రామీణ ప్రాంతాల్లో ఎంపీడీఓలు, బల్దియాలో కమిషనర్ వెంటనే కమిటీలు పూర్తి చేసి పంపాలని ఆదేశాలు జారీ అయ్యాయి. దీంతో కమిటీల ఏర్పాటుపై అధికారులు దృష్టి సారించారు. అయితే క్షేత్రస్థాయిలో క్రియాశీలకంగా ఉండే కార్యకర్తలనే ఇందిరమ్మ కమిటీలో చోటు కల్పించాలని కాంగ్రెస్ నేతల నుంచి అంతర్గతంగా సందేశాలు వెళ్లాయి.

1,99,803 దరఖాస్తులు

కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద రూ.5 లక్షలు, ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకైతే రూ.6 లక్షల ఆర్థికసాయాన్ని మూడు విడతలుగా అందజేస్తామని హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చాక గత డిసెంబరు 28 నుంచి జనవరి 6 వరకు ప్రజా పాలన కార్యక్రమం నిర్వహించి ఇందిరమ్మ ఇళ్లకు సైతం దరఖాస్తులను స్వీకరించారు. జిల్లావ్యాప్తంగా ఇళ్లు నిర్మించుకునేందుకు 1,99,803 మంది దరఖాస్తు చేసుకున్నారు. నియోజకవర్గానికి 3,500 ఇళ్లను నిర్మిస్తామని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. దీంతో జిల్లాలో ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాలకు కలిపి 7 వేల ఇళ్లు, ఆసిఫాబాద్ నియోజకవర్గ పరిధిలోని గాదిగూడ, నార్నూరు మండలాలకు 200 ఇళ్లు, ఖానాపూర్ నియోజకవర్గ పరిధిలోని ఉట్నూరు, ఇంద్రవెల్లి మండలాలకు 200 ఇళ్లు, మొత్తంగా జిల్లాకు 7,400 ఇళ్లను కేటాయించింది.

క్రియాశీలక సభ్యులే..

ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం మొత్తం ఆరుగురు సభ్యులతో ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు కానున్నాయి. గ్రామస్థాయిలో గ్రామ సర్పంచి/ప్రత్యేకాధికారి అధ్యక్షుడిగా వ్యవహరిస్తారు. స్వయం సహాయక సభ్యుల నుంచి ఇద్దరు మహిళలు, గ్రామాభివృద్ధి కార్యక్రమాల్లో క్రియాశీలకంగా వ్యవహరించే ముగ్గురు సభ్యులు(అందులో తప్పనిసరిగా బీసీ సామాజికవర్గం ఒకరు, ఎస్సీ/ఎస్టీ సామాజికవర్గం నుంచి మరొకరు)గా నిర్ణయించారు. పంచాయతీ కార్యదర్శి కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. అదే బల్దియాలో వార్డు కౌన్సిలర్/ ప్రత్యేకాధికారి ఛైర్మన్‌గా, ఇద్దరు స్వయం సహాయక సభ్యులు, అభివృద్ధి పనుల్లో క్రియాశీలకంగా ఉండే ముగ్గురు సభ్యులు(అందులో బీసీ నుంచి ఒకరు, ఎస్సీ/ఎస్టీ నుంచి మరొకరు), వార్డు ప్రత్యేకాధికారి కన్వీనర్‌గా ఉంటారు. లబ్ధిదారుల ఎంపికలో ఈ కమిటీలే క్రియాశీలక పాత్ర పోషించనున్నాయి.

రెండు రోజుల్లో పూర్తి చేయాలి

- బసవేశ్వర్, గృహనిర్మాణశాఖ అధికారి

ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రెండు రోజుల్లో కమిటీలను పూర్తి చేసి పంపాలని ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్‌లకు సూచించాం. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో కమిటీకి బాధ్యత ఉంటుంది.



సుంకిడిలో బతుకమ్మల శోభాయాత్ర

గంగమ్మ ఒడికి గౌరమ్మ



తలమడుగులో బతుకమ్మను నిమజ్జనం చేస్తున్న దృశ్యం

జిల్లాలోని వివిధ గ్రామాల్లో సోమవారం మహిళలు బతుకమ్మ నిమజ్జన వేడుకలు నిర్వహించారు. దసరా తర్వాత తలమడుగు మండలం సుంకిడి, బరంపూర్, తలమడుగు, కుచులాపూర్, గ్రామాల్లో తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మలను ఎత్తుకొని మహిళలు గ్రామ శివారులోని కుంటలు, చెరువుల వద్దకు పాటలు పాడుకుంటూ వెళ్లారు. అక్కడ కోలాటాలు, నృత్యాలు చేసుకుంటూ సందడి చేశారు. అనంతరం బతుకమ్మలను నిమజ్జనం చేశారు.

- న్యూస్‌టుడే, తలమడుగు

కనులవిందుగా.. హిమ వర్షం



రెండు రోజులుగా రాత్రి సుమారు 9 గంటల నుంచి ఉదయం 8 గంటల వరకు పొగ మంచు జిల్లాను కమ్మేస్తోంది. పలు రహదారులు, కూడళ్లు సైతం కనిపించడం లేదు. చలి పెరిగి మంచు వర్షాన్ని తలపించేలా కురుస్తోంది. బయట ఉంచిన వాహనాలు ఉదయానికి నీటితో శుభ్రం చేసినట్లు కనిపిస్తున్నాయి. ఆదివారం రాత్రి 10 గంటల సమయంలో ఎన్టీఆర్ కూడలికి వెళ్లే రహదారిలో వర్షాన్ని తలపించేలా మంచు కురుస్తోందిలా.. - ఈనాడు, ఆదిలాబాద్



పాలు పొంగించి... తెల్లబంగారం తీసి..

తెల్లబంగారంగా పిలిచే పత్తి పంట చేతికందుతోంది. పత్తిని తీసే ముందు పంటచేలలో పాలు పొంగించి సీతమ్మకు ఊయల కట్టి పూజలు చేయడం ఆనవాయితీ. పిప్పల్‌కోటిలో ఓ మహిళ తన కూతురితో కలిసి పాలు పొంగించి పత్తి తీసే పనులకు శ్రీకారం చుట్టారిలా.. - న్యూస్‌టుడే భీంపూర్

పాలనాధికారి సెలవు.. అర్జీదారులు కరవు



అర్జీదారుల కోసం నిరీక్షిస్తున్న అదనపు పాలనాధికారి శ్యామలదేవి, ఇతర అధికారులు

జిల్లా పాలనాధికారి రాజర్షిషా లేక సోమవారం ప్రజావాణి విభాగం వెలవెలబోయింది. ఆయన వ్యక్తిగత సెలవు పెట్టడంతో అదనపు పాలనాధికారి శ్యామలదేవి, ఇతర అధికారులు నిర్ణీత సమయానికే కలెక్టరేట్ సమావేశ మందిరానికి వచ్చినా గంటన్నరపాటు వారు అర్జీదారుల కోసం నిరీక్షించాల్సి వచ్చింది. మధ్యాహ్నం 12 గంటల తర్వాత ఒక్కొక్కరు రావడం ఆరంభించారు. అప్పటికే అధికారులు కొందరు అదనపు పాలనాధికారి అనుమతి తీసుకుని తమ కార్యాలయాల బాట పట్టారు. వచ్చిన వారి నుంచి అర్జీలు స్వీకరించి వాటి పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని అదనపు పాలనాధికారి భరోసా ఇచ్చారు. - న్యూస్‌టుడే, పాలనాప్రాంగణం

అపోహలు వీడేలా.. చెల్లుబాటయ్యేలా

● పది నాణెంపై బ్యాంకు సిబ్బంది ప్రచారం

న్యూస్‌టుడే, లక్సెట్టిపేట


పది రూపాయల నాణెం చెల్లుబాటుపై ప్రజల్లో ఉన్న అపోహను తొలగించి వాటిని అన్ని వర్గాలతో వాడకంలోకి తెచ్చేందుకు రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రయత్నాలు ముమ్మరం చేసింది. అటు దుకాణ దారులు, ఇటు వినియోగదారులకు నమ్మకాన్ని కలిగించి వాటి చలామణి పెంచేందుకు వీలుగా ప్రచారాన్ని ప్రారంభించింది. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సహకారంతో నాణేల చట్టబద్ధతపై విస్తృత ప్రచారానికి శ్రీకారం చుట్టింది.



లక్సెట్టిపేటలో దుకాణదారులకు పది రూపాయల నాణేలు అందజేస్తున్న బ్యాంకు సిబ్బంది.

చిల్లర డబ్బుల కొరత

చిల్లర డబ్బుల చలామణి మామూలుగా కూరగాయల మార్కెట్లు, చిరు వ్యాపారులు, పాన్ దుకాణాలు, చిన్న చిన్న హోటళ్లు, కిరాణా దుకాణాల్లో ఎక్కువగా సాగుతాయి. పది రూపాయల నాణేలు చెల్లుబాటు కావన్న అపోహ ప్రజల్లో బలంగా నాటుకుపోయిన కారణంగా అక్కడ కూడా తీసుకోవడానికి నిరాకరిస్తున్నారు. తప్పని పరిస్థితుల్లో చిరిగిన, నలిగిపోయిన నోట్లు తీసుకుంటున్నారు తప్ప వీటిని తీసుకోవడానికి వెనకడుగు వేస్తున్నారు. దీంతో మార్కెట్లో చిల్లర డబ్బుల కొరత తీవ్రంగా మారింది.



రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా పది రూపాయల నాణేలను 2005లో తొలిసారిగా ముద్రించింది. 2019 వరకు ఆయా సందర్భాలను బట్టి 14 సార్లు ఇవి విడుదలయ్యాయి. అన్ని రకాల నాణేలు చెల్లుబాటులో అవుతాయని రిజర్వు బ్యాంకు పలుమార్లు స్పష్టం చేసినా వాటి చలామణి దాదాపు నిలిచిపోయింది.

ఇదీ సమస్య

అవగాహన ఉన్న కొందరు వాటిని వాడుదామనుకున్నా ఎదుటి వ్యక్తులు వాటిని తీసుకోవడానికి నిరాకరించడంతో బహిరంగ మార్కెట్లో వాడకం నిలిచిపోయింది. పది రూపాయల నోట్లు మార్కెట్లో ఉన్నప్పటికీ చేతులు మారేకొద్దీ అవి చినిగి పనికి రాకుండా పోతాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని రిజర్వు బ్యాంకు పది రూపాయల నాణేలు ముద్రిస్తున్నా వాటి చలామణి నిలిచిపోవడం సమస్యగా మారింది.

ఏం చేస్తున్నారంటే...

బ్యాంకు పరిధిలోని మార్కెట్లు, దుకాణాలు, రైతు బజార్‌లు, ప్రధాన మంత్రి స్వనిధి లబ్ధిదారులను కలిసి వారికి పది రూపాయల నాణెం చలామణికి సంబంధించి చట్టబద్ధతపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ నెల 15వ తేదీన కూడా విస్తృతంగా ప్రచారం నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా బ్యాంకు సిబ్బంది తమ కరెన్సీ చెస్ట్ నుంచి కనీసం పది నాణేలు తీసుకుని వాటిని అన్ని వర్గాలకు పంపిణీ చేసి చలామణిలోకి తీసుకొచ్చేలా ప్రచారం చేస్తున్నారు. తర్వాత రోజుల్లో బ్యాంకు సిబ్బంది లావాదేవీల సందర్భంగా ప్రతి వినియోగదారుడికి నగదు చెల్లింపుల సందర్భంగా నిర్ణీత మొత్తంలో నాణేలు అందజేయనున్నారు. దీంతో మార్కెట్‌లో చిల్లర సమస్య తొలగనుంది.

తీసుకోవడానికి నిరాకరిస్తే చర్యలు

పది రూపాయల నాణేలు చెల్లుబాటు కావనేది అపోహ మాత్రమే. గతంలో పలుమార్లు రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా నాణేల చట్టబద్ధతపై స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. ఎవరైనా పది రూపాయల నాణేలు తీసుకోవడానికి నిరాకరిస్తే చట్టప్రకారం చర్యలు తప్పవు.

- బిశ్వనాథ్ బోయ్, బ్రాంచి మేనేజర్, యూనియన్ బ్యాంకు, లక్సెట్టిపేట

నేడు డీఎస్సీ అభ్యర్థులకు కౌన్సెలింగ్

● బుధవారం నుంచి విధుల్లో చేరిక

పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే: జిల్లాలోని పాఠశాలలకు కొత్త టీచర్లు రానున్నారు. డీఎస్సీ-2024లో ఎంపికైన అభ్యర్థులకు మంగళవారం డీఈవో కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. జిల్లాలో మొత్తం 266 మంది అభ్యర్థులు ఈ కౌన్సెలింగ్‌కు హాజరుకానుండటంతో ఆ మేరకు పోస్టులు భర్తీ కానున్నాయి. ఇదే సందర్భంలో బదిలీ అయి రిలీవ్ కాకుండా ఉన్న ఉపాధ్యాయులు కోరుకున్న చోటుకు వెళ్లనున్నారు. మరోవైపు కౌన్సెలింగ్ ద్వారా ఎంపిక చేసుకున్న పాఠశాలల్లో బుధవారం నుంచి నూతన టీచర్లు అడుగు పెట్టనున్నారు.

జిల్లాలో డీఎస్సీ-2024 ద్వారా ఉపాధ్యాయుల భర్తీకి 324 పోస్టులను నోటిఫై చేయగా అందులో 266 పోస్టులకు 1:3 ప్రాతిపదికన అభ్యర్థులను పిలిచి ధ్రువపత్రాల పరిశీలన చేసిన సంగతి తెలిసిందే. తాజాగా నియామక పత్రాలు పొందిన వారందరికీ మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహించి పాఠశాలలను కేటాయించాలని విద్యాశాఖ ఆదేశించింది. ఈ మేరకు అధికారయంత్రాంగం చర్యలు చేపట్టింది. విద్యార్థుల సంఖ్యను బట్టి హేతుబద్ధీకరణ నిబంధనలకు అనుగుణంగా ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ చేయనున్నారు. మారుమూల ప్రాంతాలకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ఇందుకు సంబంధించిన కసరత్తు పూర్తి చేసి అభ్యర్థులకు ఖాళీలను అందుబాటులో ఉంచి ర్యాంకుల వారీగా పిలిచి ఆయా పాఠశాలలను కేటాయించనున్నారు. డీఎస్సీ-2024లో ఎంపికై తమ కార్యాలయంలో రిపోర్టు చేసిన అభ్యర్థులంతా మంగళవారం ఉదయం 10 గంటలకు నిర్వహించే కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని డీఈవో ప్రణీత తెలిపారు. అభ్యర్థులు వెంట మూడు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు తీసుకురావాలని సూచించారు.

పరివర్తనతో పాటు ఉపాధి



ఆదిలాబాద్‌లో జైళ్లశాఖ పెట్రోల్‌బంకులో వినియోగదారుల వాహనంలో పెట్రోల్ పోస్తున్న సిబ్బంది

ఆదిలాబాద్ నేర విభాగం, న్యూస్‌టుడే

వివిధ కారణాలతో నేరాలు చేసి జైలుకు వచ్చే వారిలో పరివర్తన తీసుకురావటంతోపాటు విడుదల అయ్యాక వారికి ఉపాధి కల్పించటానికి జైళ్ల శాఖ కృషి చేస్తోంది. ఇందుకు జైళ్ల శాఖ ఖైదీలకు వివిధ పనుల్లో వృత్తి శిక్షణ ఇస్తోంది. ప్రత్యామ్నాయ మార్గాల్లో ఉపాధి కల్పించటానికి పెట్రోలియం శాఖతో ఒప్పందాలు కుదుర్చుకొని బంకులు ఏర్పాటు చేస్తోంది. మంచి నడవడిక, నిజాయతీ గల ఖైదీలను గుర్తించి ఓపెన్ ఖైదీలుగా వారికి ఈ బంకుల్లో పని కల్పిస్తోంది.

ఆదిలాబాద్‌లో జైళ్ల శాఖ ఆధ్వర్యంలో జైలు సమీపంలో గతేడాది భారత్ పెట్రోలియం సహకారంలో పెట్రోల్‌బంకు ఏర్పాటు చేశారు. ఆసిఫాబాద్‌లోనూ ఇండియన్ ఆయిల్ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకొని పెట్రోల్‌బంకును కొనసాగిస్తున్నారు. వివిధ నేరాల్లో శిక్ష అనుభవించి విడుదలైన వారికి, శిక్ష అనుభవిస్తున్న వారిలో సత్ప్రవర్తన కలిగి ఉన్న వారిని ఎంపిక చేసి పెట్రోల్ బంకుల్లో ఉపాధి కల్పిస్తున్నారు. ఆదిలాబాద్ జైళ్ల శాఖ నిర్వహిస్తున్న బంకులో ప్రస్తుతం ఓపెన్ జైలు ఖైదీలు అయిదుగురు, పీఐఎంఎస్(ప్రిజినర్స్ ఇన్ఫర్మేషన్ మేనేజ్‌మెంట్ సిస్టం)లో ఒకరు ఉపాధి పొందుతున్నారు. ఓపెన్ జైలు ఖైదీలకు రూ. 7,500 వేతనం చెల్లిస్తున్నారు. ఈ వేతనాన్ని వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నారు. విడుదలయ్యాక వారు స్వయం ఉపాధి పొందటానికి ఇది ఉపకరిస్తుందని జైలు అధికారులు పేర్కొంటున్నారు. ఆసిఫాబాద్ జిల్లా జైలు వారు నిర్వహిస్తున్న పెట్రోల్‌బంకులో శిక్షా కాలం పూర్తి చేసుకొని విడుదలైన ఎనిమిది మందికి ఉపాధి కల్పించారు. వీరికి నెలకు రూ.15వేల వేతనం చెల్లిస్తున్నారు. ఆదిలాబాద్ జిల్లా జైలులో త్వరలో సీఎన్‌జీ(కంప్రెస్డ్ నేచరల్ గ్యాస్)ను సైతం వినియోగదారులకు అందుబాటులోకి తీసుకురావటానికి బంకును ఏర్పాటు చేశారు. ప్రస్తుతం పనులన్నీ పూర్తయ్యాయి. ప్రారంభించటం మాత్రమే మిగిలి ఉంది. ఈ బంకు ప్రారంభమైతే మరో ఇద్దరికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.



ఆదిలాబాద్‌లో జైలు సమీపంలో జైళ్లశాఖ నిర్వహిస్తున్న పెట్రోల్‌బంక్‌లో ఏర్పాటు చేసిన సీఎన్‌జీ గ్యాస్ పంపు, గ్యాస్ సిలిండర్లు ఇవి. మరో నెల రోజుల్లో వినియోగదారులకు సీఎన్‌జీ గ్యాస్‌ను అందుబాటులోకి తీసుకురావటానికి దీన్ని ఏర్పాటు చేశారు. భారత్ పెట్రోలియం సహకారంతో దీన్ని అందుబాటులోకి తీసుకురానున్నారు. ఈ పంపు అందుబాటులోకి వస్తే ఆదిలాబాద్ పట్టణంలో వినియోగదారులకు అందించే సీఎన్‌జీ గ్యాస్ మొదటి పంపు అవుతుంది.

రైతేరాజు 6 లో

సస్యరక్షణతోనే దిగుబడి..

మంచిర్యాల వ్యవసాయం, న్యూస్‌టుడే:

ప్రస్తుతం వరిలో కలుపు పనులు పూర్తయ్యాయి. ముందుగా నాటు వేసిన చోట గొలకలు వేస్తున్నాయి. కర్ర గట్టిపడుతోంది. ఈ సమయంలోనే పంటలు కాపాడుకోవడం ఎంతో కీలకం. పంటను ఏమాత్రం అశ్రద్ధ చేసినా దిగుబడి తగ్గే ప్రమాదముంది. అయితే పంట చేతికొచ్చే వేళ వాతావరణంలో వస్తున్న మార్పుల వల్ల చీడలు ఆశించే ప్రమాదముంది. చీడలను పసిగట్టి నివారణ చర్యలు వాడి... సస్యరక్షణ చర్యలు వాడితేనే దిగుబడి వస్తుందని బెల్లంపల్లి కేవీకే శాస్త్రవేత్త డా.శివకృష్ణ వెల్లడించారు.


సాగు చేస్తున్న వరి

వరిలో ఇలా..

కంకినల్లి: ఈ పురుగు ఆశిస్తే గొలక నల్లగా మారుతుంది. దీని నివారణకు వర్షం లేని సమయంలో ఎకరాకు ఒక మి.ల స్పైరోమెసిఫెన్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

కాండం తొలుచుపురుగు: ఈపురుగు సోకితే పిలకలు చనిపోయి తెల్లకంకులుగా మారతాయి. కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 2.0 గ్రాములు లేదా ఫాస్ఫమిడాన్ 2.0 మి.లీ లేదా అసిఫేటు 1.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

అగ్గితెగులు: గాలిలో తేమ ఎక్కువగా ఉండటం వల్ల అగ్గితెగులు ఆశించే ప్రమాదం ఉంది.. దీని నివారణకు 0.6 గ్రా. ట్రైసైక్లోజోల్ లేదా 1.5 మి.లీఐసోప్రొథయోలేన్ లీటరు నీటికి కలిపి 10-15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి.

దోమపోటు, సుడిదోమ: గోధుమ వర్ణపు దోమ, తెల్ల మచ్చ దోమ వరిపైరును ఆశించడం వల్ల కర్ర మొదళ్ల దగ్గర చేరి రసం పీలుస్తాయి. దీనివల్ల పైరు సుడులుసుడులుగా ఎండిపోతుంది. పొలంలో నుంచి నీటిని తీసివేసి 1.5ఎసిఫేటు 75 ఎస్‌పీ లీటరు నీటికి వరి పైరు మొదళ్లపై పడేట్లు పిచికారీ చేయాలి. ఉధృతి ఎక్కువగా ఉంటే ఒక ఎకరానికి కార్బోఫ్యూరాన్ 10 జీ గుళికలు 10 కిలోలు లేదా బూప్రొఫెజిన్ 1.6 మి.లీ లీటరు నీటికి కలిపి మొదళ్ల దగ్గర తడిచేలా పిచికారీ చేయాలి.

ఆకుముడత: గొంగళి పురుగు ఆకులు రెండు అంచులు కలిపి లోపలి నుంచే కర్ర ఆకుపచ్చ పదార్థాన్ని తినివేయడం వల్ల ఆకులు ఎండిపోతాయి. దీని నివారణకు ఎసిఫేటు 1.5 గ్రాములు లేదా కార్టాప్ హైడ్రోక్లోరికామ్లం 2.0 గ్రాములు లేదా ప్రొఫెనోఫాస్ 2.0 మి.లీ లేదా మోనోక్రోటాఫాస్ 1.6 మి.లీ ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

రైతేరాజు

పత్తిలో సస్యరక్షణ చర్యలు: పత్తి ప్రస్తుతం కాయగట్టి పడే దశలో ఉంది. ఈ దశలో సస్యరక్షణ చర్యలు ఇలా...

రసం పీల్చే పురుగు: ఈ పురుగు లార్వాలు మొగ్గలు, పువ్వులకు చిన్నరంధ్రాలు చేసి కర్రకు నష్టం చేకూరుస్తాయి. దీంతో మొగ్గలు, పువ్వులు రాలిపోతాయి. కాయలు, పిందెలను తింటూ నష్టం కలుగజేస్తాయి. నివారణకు ప్రొఫెనోఫాస్ 2 మి.లీ. లేదా థయోడికార్బ్ 1.5 గ్రాము లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. ఉధృతి ఎక్కువగా ఉంటే ఇండాక్సాకార్బ్ 1మి.లీ లేదా స్పైనోశాడ్ 0.3 మి.లీ లేదా ఇమామెక్టిన్ బెంజోయేటు 0.5 గ్రాము లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

మచ్చల పురుగు: ఈ పురుగు లార్వాలు లేత కొమ్మలను కాయలను తొలచి నష్టం చేస్తాయి. ఇవి ఆశిస్తే కొమ్మ ఎండిపోయి, కాయలు రాలిపోతాయి. పురుగు ఆశించిన భాగాల్లో దీని విసర్జన పదార్థం కన్పిస్తుంది. దీని నివారణకు క్లోరిపైరిపాస్ 2.5 మి.లీ లేదా థయోడికార్బ్ 1.5 గ్రా.లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

పది పంటలు.. ప్రతి రోజు ఆదాయం

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ వ్యవసాయం : పట్టణానికి దగ్గరలో ఉన్న పల్లె రైతులు రోజు వారీ ఆదాయం వచ్చే పంటలపై దృష్టి సారించారు. ఒకటి, రెండు పంటలతో సరిపెట్టుకోకుండా.. కూరగాయలు, పూలు తదితర పంటలు సాగు చేస్తూ ఆదాయం గడిస్తున్నారు. ఇలాంటి రైతుల్లో తాంసి మండలం వడ్డాడికి చెందిన పొచ్చన్న ఒకరు. వడ్డాడిలో కొంత భూమి ఉన్నా.. రోడ్డు పక్కన పట్టణానికి దగ్గరలో ఉండే పొన్నారిలో ఎకరం భూమి కౌలుకు తీసుకున్నారు. టమాటా, వంకాయ, బెండ, అలచెంత, బబ్బెర, బీరకాయ కూరగాయలతో పాటు ఆకుకూరలు సాగు చేసి ఎప్పటికప్పుడు మార్కెట్‌కు తరలించేలా ఏర్పాట్లు చేసుకున్నారు.


పండించిన పంటతో రైతు పొచ్చన్న, వడ్డాడి, తాంసి

ఆదర్శం

జిల్లా కేంద్రానికి గ్రామం దగ్గరలో ఉండటం.. రోజు పండించిన పంట ఉత్పత్తులను మార్కెట్‌కు తరలించడం సులువుగా ఉండటంతో కూరగాయలను సాగు చేసి రోజు ఆదాయం పొందవచ్చని భావించారు. సొంత భూమిలో పత్తి, సోయా సాగు చేసి, కౌలుకు తీసుకున్న భూమిలో ఒక పంట చేతికి రాగానే మరో పంట చేతికి వచ్చేలా కూరగాయలు సాగు చేశారు. ఎక్కువ దిగుబడి వస్తే టోకుగా విక్రయిస్తారు. పది రకాల పంటలు సాగుకు మొత్తంగా ఏడాదిలో రూ.5 లక్షల పెట్టుబడి కాగా, ఖర్చులు పోనూ ఎకరానికి రూ.2 లక్షల చొప్పున 6 లక్షల ఆదాయం పొందే అవకాశం ఉందన్నారు. ఈ సీజన్‌లో మొన్నటి వరకు టమాటా ధర తక్కువగా ఉండేది.

ఇప్పుడు ఏకంగా కిలో రూ.80కి పైగా ఉంది. పూలు కిలో రూ.80 నుంచి రూ.100 వరకు ధర ఉంది. పలు రకాల పంటల సాగుతో ఒక రకానికి ధర తగ్గినా.. మరో పంటతో ఆదాయం పొందే అవకాశం ఉంటుందని వివరించారు.

రైతు ప్రశ్న శాస్త్రవేత్త సమాధానం



రాజశేఖర్,
కీటక శాస్త్రవేత్త
కృషి విజ్ఞాన
కేంద్రం, ఆదిలాబాద్
ఫోన్ నెంబరు: 99085 56659

ప్రశ్న : పత్తి పూత దశలో ఉంది. ప్రస్తుత పరిస్థితుల్లో పంటను ఆశించే పురుగులను నివారించడం ఎలా?
- రాకేశ్, జైనథ్

జవాబు : 5 మి.లీ వేప నూనె(1500 పీపీఎం) లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.


ప్రశ్న : కంది పంటలో మొక్క ఎదగాలంటే ఏం చేయాలి?
- ఆశన్న, బెల్లూరి

పాల దిగుబడి ఇలా...

ప్రస్తుతం గేదెలు ఎక్కువగా ఈనుతుంటాయి. చూడి గేదెలను సంరక్షణలో జాగ్రత్తలు తీసుకుంటేనే పాల దిగుబడి బాగా వస్తుందని పశువైద్యాధికారి ధన్‌రాజ్ వివరించారు. పచ్చిగడ్డితో బదులు నేపియర్, జొన్న కర్రలు, లవణాలు, సమీకృత దాణా అందజేయాలి. గడ్డి, జొన్న, నేపియర్ విత్తనాలు రాయితీపై పశువుల ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్నాయి. పాల దిగుబడి కోసం గేదెలకు కాల్షియం బోరో గ్లూకోజ్ ఇంజక్షన్లు వేయించాలి. ముందస్తుగా టీకాలు వేయించి దోమలు లేకుండా చూడాలి. **- న్యూస్‌టుడే, దండేపల్లి**

మీకు తెలుసా?

సార్వత్రిక చదువు..భవితకు వెలుగు



చెన్నూరు, న్యూస్‌టుడే:

చదువుకోవాలని కొందరికి ఆసక్తి ఉంటుంది. కానీ వివిధ కారణాలు, కుటుంబ ఆర్థిక పరిస్థితులతో పాఠశాల స్థాయిలోనే మధ్యలో ఆపేస్తుంటారు. ఇంకొందరు పదోతరగతి పూర్తయిన తర్వాత ఇంటర్ విద్యకు వెళ్లకుండా మానేస్తుంటారు. మళ్లీ చదువుకోవాలనే ఆసక్తి ఉన్న వారికి తెలంగాణ స్టేట్ ఓపెన్ స్కూల్ సొసైటీ సదవకాశం కల్పిస్తోంది. ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్‌లోనూ ప్రవేశాలు అందుబాటులోకి వచ్చాయి. డిగ్రీ, పీజీలు కూడా చేయొచ్చు. ఏటా వేలాది మంది ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రవేశాలు తీసుకుంటూ చదువుపై దృష్టి పెడుతున్నారు. అయితే దీన్ని సద్వినియోగం చేసుకుని ప్రభుత్వ కొలువులు సాధిస్తున్న నేపథ్యంలో కథనం.


దరఖాస్తు ఇలా..

ఓపెన్ పది, ఇంటర్‌లో ఈ విద్యా సంవత్సరం 2024-25లో ప్రవేశాలు పొందడానికి అపరాధ రుసుముతో ఈ నెల 30వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు.

డిగ్రీ, పీజీకి అవకాశం

ఓపెన్ పది, ఇంటర్ పూర్తి చేసిన అభ్యాసకులు దూరవిద్యావిధానం ద్వారా డిగ్రీ ఆ తరువాత పీజీ చదువొచ్చు. ఓపెన్ ఇంటర్ పూర్తి చేసిన వారు రెగ్యులర్‌గా లేదంటే దూరవిద్యా విధానం ద్వారా డిగ్రీ చదవాలి. డిగ్రీ పూర్తి చేసిన వారు దూరవిద్యావిధానం ద్వారా లేదంటే రెగ్యులర్‌గా పీజీ చదువుకోవచ్చు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వాసులకు కాకతీయ, అంబేద్కర్ విశ్వవిద్యాలయాలు దూర విద్యావిధానం ద్వారా పీజీ చేసే అవకాశం కల్పించాయి.


ఓపెన్ స్కూల్‌కు హాజరైన అభ్యాసకులకు బోధిస్తున్న అధ్యాపకుడు



లక్సెట్టిపేట మండలం వెంకట్రావ్‌పేట గ్రామానికి చెందిన చెలిమెల రాజు స్కూల్ అసిస్టెంట్(తెలుగు)గా జిల్లాలో రెండో స్థానం, భాషా(తెలుగు) పండితుడిగా మూడో స్థానంలో ర్యాంకు సాధించారు. కుటుంబ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా పదో తరగతి వరకు చదువుకొని మానేశాడు. అనంతరం స్వయం ఉపాధి పొందారు. 2008-2011లో దూర విద్యలో డిగ్రీ చదివారు. అనంతరం బీఈడీ, పీజీ పూర్తి చేశారు. గురుకుల పీజీటీ తెలుగు ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. డీఎస్సీకీ సిద్ధమై మరో ఉద్యోగం సాధించారు. ఆర్థిక పరిస్థితులతో చదువు మధ్యలో మానేసినా నిరాశ చెందకుండా దూరవిద్యావిధానంతో తన లక్ష్యాన్ని సాధించి పలువురికీ ఆదర్శంగా నిలిచారు.

- చెన్నూరు ఓపెన్ పది, ఇంటర్ కేంద్రాల్లో చదువులు పూర్తి చేసిన ఎంతో మంది రెవెన్యూ, ఇతర శాఖల్లో ఉద్యోగాలు సాధించారు.
- ఓపెన్ ఇంటర్ పూర్తి చేసిన కాసిపేట మండలానికి చెందిన ఓ అభ్యాసకుడు 2018లో నీట్‌కు అర్హత సాధించాడు.

రెగ్యులర్ విద్యతో సమాన గుర్తింపు

- అశోక్, ఓపెన్ స్కూల్ సొసైటీ ఉమ్మడి జిల్లా సమన్వయకర్త

ఓపెన్ స్కూల్ విద్యకు రెగ్యులర్‌తో సమాన గుర్తింపు ఉంది. పది పూర్తిచేసిన వారు ఆపై విద్యకు, ఇంటర్ పూర్తి చేసిన వారూ ఉన్నత విద్యకు అర్హులే. ప్రభుత్వ రంగంలో చిరు ఉద్యోగాలు చేసుకునే వారికి పదోన్నతులకు అవకాశం ఉంటుంది. ఓపెన్ ఇంటర్ చదివిన వారికి గత ప్రభుత్వంలో పదోన్నతులు, ఉద్యోగాలు కూడా సాధించారు.

సీతాఫలం @ పీచర


చెట్టుపై

లక్ష్మణచాంద, న్యూస్‌టుడే: కాలనుగుణంగా, ప్రకృతి పరంగా లభించే ఫలాల్లో సీతాఫలాన్ని అందరూ ఇష్టపడుతారు. మధురమైన సీతాఫలాలకు లక్ష్మణచాంద మండలం పీచర గ్రామం ప్రసిద్ధి. ఈ గ్రామంలో సీతాఫలం చెట్టులేని తోట ఉండదంటే అతిశయోక్తి కాదు. పీచరలోకి ప్రవేశించే మార్గంలో రహదారికి ఇరువైపులా సీతాఫలం చెట్లు స్వాగతం పలుకుతాయి. తమ పరిధిలోని తోటల్లో, రహదారుల వెంట ఏ ఒక్క రైతు వీటిని నాటలేదు. ప్రకృతి పరంగా మొలిచిన చెట్లను రక్షిస్తుండటంతో ఏపుగా పెరిగి రైతులకు శీతాకాలంలో అదనపు ఆదాయాన్ని ఇస్తున్నాయి. వర్షాకాలం ముగింపు.. సీతాకాలం ప్రారంభంలో స్థానిక రైతులు ఈ చెట్లకు కాపలాగా ఉంటారు. నిత్యం నిర్మల్‌కు తీసుకెళ్లటంతో పాటు, స్థానికంగా విక్రయిస్తుంటారు. నిర్మల్‌లోని ప్రధాన రహదారుల వెంట, మార్కెట్ ప్రాంతంలో గ్రామ మహిళలు విక్రయిస్తుంటారు. చెట్లపై పండిన పండ్లను నేరుగా మార్కెట్‌కు తీసుకెళ్తుండటంతో ఇక్కడి ఫలానికి అధిక డిమాండ్ ఉంటుంది. ఒక్కో ఫలానికి సైజును బట్టి రూ.15 నుంచి రూ.70 వరకు ధర పలుకుతోంది. గ్రామంలోని దాదాపు పదిహేను కుటుంబాలు పండ్లు వచ్చినన్ని రోజులు విక్రయాలు జరుపుతుంటాయి. తన తోటలోని చెట్ల ద్వారా సుమారు రూ.50 వేల ఆదాయం సమకూరుతుందని స్థానిక రైతు తెలిపారు.


పీచర వెళ్లే మార్గంలో రహదారికి ఇరువైపులా సీతాఫలం చెట్లు


పోటీలను ప్రారంభిస్తున్న అతిథులు, క్రీడా సంఘాల సభ్యులు, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి

అట్టహాసంగా తైక్వాండో జోనల్ స్థాయి పోటీలు

మంచిర్యాల క్రీడావిభాగం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలో పాఠశాల క్రీడా సమాఖ్య ఏర్పాటు చేసిన జోనల్ స్థాయి (ఉమ్మడి జిల్లా) తైక్వాండో పోటీలు సోమవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. అండర్-14, 17 బాలబాలికల విభాగాల్లో స్థానిక సెవెన్‌హిల్స్ పాఠశాలలో పోటీలు నిర్వహించారు. ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి ఫణిరాజా, పాఠశాల కరస్పాండెంట్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని మెరుగైన ఆటతీరుతో ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఇక్కడ రాణించిన వారిని త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు ఫణిరాజా తెలిపారు. తైక్వాండో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి వెంకటస్వామి, శిక్షకుడు మండ శ్రీనివాస్, సీనియర్ క్రీడాకారులు రోహిత్, రాహుల్, శ్రావణ్, శ్రీజ, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతాలు చూసేద్దాం..

తెలంగాణ దర్శినికి ప్రభుత్వం శ్రీకారం

న్యూస్‌టుడే, కాగజ్‌నగర్ : కొత్త ప్రాంతాల్లో పర్యటించాలన్న ఆసక్తి ఉన్న విద్యార్థులను ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ప్రభుత్వ పాఠశాల, కళాశాల విద్యార్థులకు పర్యాటక, చారిత్రక ప్రాంతాలపై అవగాహన కల్పించేందుకు 'తెలంగాణ దర్శిని'కి శ్రీకారం చుట్టింది. రెండో తరగతి నుంచి డిగ్రీ విద్యార్థుల వరకు వివిధ పర్యాటక ప్రదేశాలను సందర్శించేందుకు అవకాశం కల్పిస్తోంది. ఖర్చును ప్రభుత్వమే భరిస్తుంది. సెలవుల తర్వాత.. ఎకో టూరిజం, ఆర్ట్, క్రాఫ్ట్, వారసత్వం, సాంస్కృతిక, చారిత్రక, శాస్త్రీయ ప్రాముఖ్యత ఉన్న ప్రదేశాలను సందర్శించేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని సెప్టెంబరు 29న జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో దసరా సెలవుల తర్వాత అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ప్రభుత్వ నిర్ణయం మేరకు ఇప్పటికే కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులు పర్యాటక ప్రాంతాల సందర్శన మొదలైంది. ఇటీవల కళాశాలలో టూరిజం క్లబ్ ఏర్పాటు చేసి స్థానిక త్రిశూల్ పహాడ్‌పై ఉన్న ఆలయ సముదాయాలను సందర్శించారు. త్రిశూల్ పహాడ్‌ను పర్యాటక ప్రదేశంగా మార్చడానికి ఏర్పాటు చేయాల్సిన వసతులపై విద్యార్థులు నమోదు చేసుకున్నారు.


కోసిని రిజర్వాయర్ వద్ద విద్యార్థులకు జాతీయ విపత్తుల రక్షణ దళం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం



త్రిశూల్‌పహాడ్‌పై పర్యటనలో కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు

తరగతుల వారీగా వివరాలు

విభాగం	తరగతులు	రోజులు	దూరం	ఒక్కో విద్యార్థికి ఖర్చు(రూ.లలో)
1	2-4	ఒక రోజు	స్థానికం (మండల పరిధి)	300
2	5-8	ఒక రోజు	20-30	800
3	9-ఇంటర్	రెండు రోజులు	50-70	2000
4	డిగ్రీ	నాలుగు రోజులు	రాష్ట్రంలో ఎక్కడైనా	4000

సంప్రదాయాలు తెలుసుకునే అవకాశం



తెలంగాణ దర్శిని కార్యక్రమం విద్యార్థులకు తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలు తెలుసుకునే అవకాశం కల్పిస్తుంది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో చారిత్రక ప్రదేశాలు, ఇతర పర్యాటక ప్రదేశాలపై ప్రత్యేక అవగాహన ఏర్పడుతుంది. వారసత్వ సంపదను కాపాడుకోవడంలో భాగస్వాములు అయ్యే అవకాశం ఉంది.
- వాసాల ప్రభాకర్, మండల విద్యాధికారి, కాగజ్‌నగర్

పర్యాటక రంగ అభివృద్ధికి దోహదం



విద్యార్థుల్లో పర్యాటక రంగంపై అవగాహన కల్పించేందుకు తెలంగాణ దర్శిని ఎంతగానో ఉపయోగపడనుంది. పర్యాటక రంగంలో వస్తున్న మార్పులు, ఉద్యోగ అవకాశాలను సైతం డిగ్రీ విద్యార్థులకు వివరించి పర్యాటక రంగంలో ఉపాధి పొందేలా ప్రణాళికలు తయారు చేస్తాం.
- లక్ష్మినరసింహం, వైస్ ప్రిన్సిపల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల. కాగజ్‌నగర్

బాసరలో ప్రసాదాల కొరత

మూడు గంటల పాటు భక్తుల నిరీక్షణ

బాసర(ముధోల్), న్యూస్‌టుడే: అధికారుల పర్యవేక్షణ లోపం, సిబ్బంది నిర్లక్ష్యం ఫలితంగా సోమవారం బాసరలోని సరస్వతి ఆలయంలో ప్రసాదాల కొరత ఏర్పడింది. బాసర గోదావరి నదిలో దుర్గామాత విగ్రహాల నిమజ్జనోత్సవాల సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో సరస్వతి అమ్మవారి దర్శనానికి తరలివచ్చారు. దర్శనం అనంతరం భక్తులు ఉదయం 9.30 గంటలకు ప్రసాదాల టిక్కెట్ కొనుక్కుని కౌంటర్‌కు వెళితే నిల్వ లేవు. ప్రసాదం వస్తోందంటూ భక్తులను మూడు గంటల పాటు ఆపారు. విసుగు చెందిన కొందరు టికెట్ డబ్బులు వెనక్కి ఇవ్వాలని అధికారులను నిలదీశారు. అధికారుల నిర్లక్ష్యం వల్లనే ఇలా జరిగిందని మండిపడ్డారు. తరచూ ఇలాగే జరుగుతున్నా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.. తీరా మధ్యాహ్నం రెండు గంటలకు చిన్న లడ్డూలను కౌంటర్‌కు తీసుకువచ్చారు. అప్పటికే పలువురు భక్తులు ప్రసాదాలు తీసుకోకుండానే వెనుతిరిగారు. ఆదివారం దసరా ఉండటంతో సోమవారం భక్తులు తక్కువగా వస్తారనే అంచనాతో ప్రసాదాల తయారీని నిలిపివేశారు. ఒక్కసారిగా భక్తులు తరలిరావడంతో కొరత ఏర్పడింది. గత సంవత్సరం ఇదే సందర్భంలో సిద్ధం చేసిన ప్రసాదాలు విక్రయం కాక గ్రామం చివరన కాల్చివేశారు. ఆలయానికి రెగ్యులర్ ఈఓ లేకపోవడం, సిబ్బంది కొరతతో పాలనాపరంగా ఇబ్బందులు తలెత్తుతున్నాయని స్థానికులు అంటున్నారు. సమస్యపై 'న్యూస్‌టుడే' ఆలయ ఇన్‌ఛార్జి ఈఓ విజయరామారావును చరవాణిలో సంప్రదించగా భక్తుల సంఖ్య ఊహించిన దానికి భిన్నంగా ఉండి సమస్య తలెత్తిందని, పునరావృతం కాకుండా చూస్తామని చెప్పారు.

స్టేషన్‌లో పోలీసు సిబ్బంది మధ్య గొడవ

సిరికొండ, న్యూస్‌టుడే : ఆదిలాబాద్ జిల్లాలోని సిరికొండ పోలీస్ స్టేషన్‌లో ఇద్దరు సిబ్బంది మధ్య జరిగిన గొడవ స్థానికంగా విమర్శలకు తావిస్తుంది. ఆదివారం రాత్రి ఇద్దరు సిబ్బంది మద్యం మత్తులో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. చుట్టుపక్కల వారు గమనించడంతో వారి తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ఘటనపై సోమవారం సీఐ భీమేష్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి విచారణ చేపట్టారు. ఈ విషయమై 'న్యూస్‌టుడే' సీఐని వివరణ కోరగా ఈ విషయం తమ దృష్టికి వచ్చిందని, విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదిస్తానని తెలిపారు.

ఉద్యోగుల బరి.. లక్ష్యంపై గురి

రాష్ట్ర, జాతీయస్థాయి హాకీ పోటీల్లో రాణింపు

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ క్రీడావిభాగం:

వీరంతా మూడు పదుల వయసు దాటినవారు. చిన్నప్పుడు ఇష్టంతో ఎంచుకున్న హాకీ ఆటలో మెరుపులు మెరిపించారు. ఇప్పటికీ రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరుస్తున్నారు. ఉన్నతంగా చదువుకుని ప్రభుత్వ కొలువులు సాధించారు. తాజాగా హైదరాబాద్‌లోని సికింద్రాబాద్ రైల్వే నిలయం ఆస్ట్రో టర్ఫ్ మైదానంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి సీనియర్ హాకీ పోటీలకు ఎంపిక య్యారు.

నిత్యం సాధన



సీనియర్ నేషనల్స్ : 1
సీనియర్ రాష్ట్రస్థాయి : 6
యూనివర్సిటీ గేమ్స్ : 2
రాష్ట్రస్థాయి పోటీలు : 30

ఆదిలాబాద్‌లోని ఖానాపూర్ కాలనీకి చెందిన షేక్ మహమ్మద్ 2000 సంవత్సరంలో హాకీ ఆటకు ఆకర్షితులయ్యారు. నిత్యం ఇందిరా ప్రియదర్శిని క్రీడా మైదానంలో సీనియర్ల వద్ద మెలకువలు నేర్చుకున్నారు. రైట్ బ్యాక్ స్థానంలో ఆడుతూ ప్రత్యర్థులు కొట్టే బంతులను గోల్స్ కాకుండా అడ్డగించడంలో ప్రావీణ్యం పొందారు. 2013లో క్రీడా విభాగంలో అబ్కారీశాఖలో కానిస్టేబుల్ ఉద్యోగం సాధించి ఇచ్చోడలో విధులు నిర్వహిస్తున్నారు.


దేశానికి ఆడాలని..



నేరడిగొండ మండలం ఫటఫటితాండ గ్రామానికి చెందిన ఆడే అశోక్‌కుమార్. హాకీలో దేశానికి ఆడాలని లక్ష్యం పెట్టుకున్నారు. గోల్ కీపింగ్‌లో శిక్షణ తీసుకున్నారు. పలు రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచారు. 2012లో క్రీడా విభాగంలో పోలీసు ఉద్యోగం సాధించారు. ప్రస్తుతం ఆదిలాబాద్‌లో ఏఆర్ హెడ్ క్వార్టర్‌లో స్పెషల్ పార్టీలో విధులు నిర్వహిస్తున్నారు. జిల్లా, రాష్ట్ర జట్టుకు పలుమార్లు సారథిగా వ్యవహరించి జట్టును ఒంటిచేత్తో గెలిపించారు.

సీనియర్ నేషనల్స్ : 4
జూనియర్ నేషనల్స్ : 4
ఆలిండియా పోలీసు క్రీడలు : 10
బెంగుళూరు, పూణే, ఖరగ్‌పూర్ లీగ్ పోటీలు : 3
రాష్ట్రస్థాయి పోటీలు : 51

నిరంతర విద్యార్థి



ఆదిలాబాద్‌లోని కుమ్మరివాడకు చెందిన యెగిడి శేఖర్ 2006 నుంచి సీనియర్లతో కలిసి హాకీ ఆడుతున్నారు. బెంగుళూరులో ఏడాదిపాటు ఎన్ఐఎస్ హాకీ డిప్లొమా కోర్సు పూర్తి చేశారు. 2019లో ఉట్నూరు గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాలలో హాకీ శిక్షకుడిగా ఉద్యోగం సాధించారు. విద్యార్థులను శిక్షణనిస్తూ, సీనియర్స్ విభాగంలో స్వయంగా పోటీల్లో పాల్గొంటున్నారు.

సీనియర్ నేషనల్స్ : 2
కేయూ, ఓయూ గేమ్స్ : 4
పైకా : 1
రాష్ట్రస్థాయి పోటీలు : 34

మైదానమే నేస్తం



సీనియర్ నేషనల్స్ : 5
యూనివర్సిటీ గేమ్స్ : 5
రాష్ట్రస్థాయి : 21
పంచాయత్ యువ క్రీడా ఔర్ ఖేల్ అభియాన్(పైకా) : 1

ఆదిలాబాద్ శాంతినగర్ కాలనీకి చెందిన పెద్దివార్ శ్రీనివాస్ 2004 నుంచి హాకీ ఆడుతున్నారు. సీనియర్ క్రీడాకారుల వద్ద శిక్షణ పొందారు. సమయం దొరికితే మైదానంలో సాధన చేస్తుంటారు. సెంటర్ ఫార్వర్డ్‌లో చురుకుగా కదులుతూ గోల్స్ చేయడంలో దిట్ట. జిల్లా, రాష్ట్ర జట్టుకు సారథిగా వ్యవహరించి పలుమార్లు జట్టును విజయపథంలో నడిపించారు. ఇందిరా ప్రియదర్శిని క్రీడా ప్రాంగణంలోని ఖేలో ఇండియా హాకీ కేంద్రంలో రెండేళ్లుగా కోచ్‌గా పని చేస్తున్నారు.

ఆటే శ్వాసగా



సీనియర్ నేషనల్స్ : 1
జూనియర్ నేషనల్స్: 1
యూనివర్సిటీ గేమ్స్ : 4
అండర్-19 ఎస్‌జీఎఫ్ నేషనల్ : 1
రాష్ట్రస్థాయి పోటీలు : 22

ఆదిలాబాద్‌లోని శ్రీరాంనగర్ కాలనీకి చెందిన ఆత్రం అతుల్ 2003లో హాకీపై మక్కువ పెంచుకుని సీనియర్ క్రీడాకారులతో కలిసి సాధన చేశారు. లెఫ్ట్ బ్యాక్‌లో ఆడుతూ ప్రత్యర్థి జట్టు గోల్స్ చేయకుండా చాకచక్యంగా ఆపడంలో మెరిక. కాకతీయ విశ్వవిద్యాలయం జట్టుకు, అండర్-19 తెలంగాణ జట్టుకు సారథిగా వ్యవహరించారు. 2020 నుంచి నార్నూరులోని ఏకలవ్య ఆదర్శ క్రీడా పాఠశాలలో హాకీ కోచ్‌గా విధులు నిర్వహిస్తున్నారు.


హాకీ సాధన చేస్తున్న ఉద్యోగులు

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)

ఆదిలాబాద్: 91541 18155
ఇచ్చోడ: 94935 57309
బోథ్: 91548 46671
ఉట్నూరు: 94410 86640

బేల, న్యూస్‌టుడే:

? బేలలోని 9వ వార్డు ఇందిరానగర్ కాలనీలో రహదారి పై మురుగు ప్రవహిస్తోంది. మురుగు కాలువ నిర్మాణం చేపట్టకపోవడంతో ఇళ్లలో వినియోగించిన నీరంతా రహదారి పై రోజుల తరబడి నిల్వ ఉంటోంది. - సులేమాన్, స్థానికుడు

✔ పరిశీలించి మురుగు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకుంటాం. - సురేష్, పంచాయతీ కార్యదర్శి, బేల

గుడిహత్నూర్, న్యూస్‌టుడే:

? మండలంలోని జాతీయ రహదారి జహుర్‌నగర్ సమీపంలో కోళ్ల వ్యర్థాలు పారబోస్తున్నారు. దుర్వాసన వస్తోంది. అశోక్, గుడిహత్నూర్.

✔ జాతీయ రహదారికి ఆనుకొని కోళ్ల వ్యర్థాలు పారబోయకుండా చర్యలు తీసుకుంటాం. - రాందాస్, పంచాయతీ కార్యదర్శి, గుడిహత్నూర్.


సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

అపూర్వ సమ్మేళనం

పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే: ఆదిలాబాద్ పట్టణంలోని గోపాలకృష్ణ విద్యామందిర్‌లో 25 ఏళ్ల కిందట పదోతరగతి చదివిన 1998-99 బ్యాచ్ పూర్వ విద్యార్థులంతా ఒకరోజు చేరి సందడి చేశారు. పట్టణంలోని టీఎన్జీవో సంఘం భవనంలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సోమవారం నిర్వహించారు. జిల్లాతోపాటు దేశ, విదేశాల్లో స్థిరపడ్డ వారంతా తరలివచ్చారు. పూర్వ విద్యార్థులు మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ మనీషా, జ్ఞానేశ్వర్‌చారి, చంద్, శ్రీనివాస్, సుభాష్, శివకుమార్, గీత, రమ, జ్యోతి, వాణి ఉన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

ఆదిలాబాద్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: జైనథ్, ఉట్నూరు ఆదర్శ గిరిజన క్రీడా పాఠశాలలకు చెందిన రాఠోడ్ కార్తిక్(ట్రయథ్లాన్-బి), హీరకప్రు నగేశ్(ట్రయథ్లాన్-సి) జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 16 నుంచి 19వ తేదీ వరకు గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం మైదానంలో నిర్వహించే సౌత్‌జోన్ జూనియర్ అథ్లెటిక్ పోటీల్లో పాల్గొంటారు. ఆ తర్వాత ఒడిశాలోని భువనేశ్వర్ కళింగ విశ్వవిద్యాలయం క్రీడా మైదానంలో నిర్వహించే 38వ జాతీయస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో తెలంగాణ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారు. వీరిని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, జిల్లా అథ్లెటిక్స్ సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అడ్డి భోజారెడ్డి, పి.రాజేశ్, కోచ్ సునంద్ అభినందించారు.


రాఠోడ్ కార్తిక్, హీరకప్రు నగేశ్


తలమడుగులో బతుకమ్మ శోభాయాత్ర

వెళ్లిరావమ్మా.. బతుకమ్మ

తాంసి, జైనథ్, తలమడుగు న్యూస్‌టుడే: మండలంలోని కప్పర్లలో బతుకమ్మ నిమజ్జన సంబరాలు సోమవారం అంబరాన్నంటాయి. తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చి స్థానిక రామాలయం వద్దకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. చెరువు వద్ద గౌరమ్మకు పూజలు చేసి నైవేద్యం సమర్పించారు.


జైనథ్‌లో బతుకమ్మలతో మహిళలు

ఘనంగా ధమ్మచక్ర పరివర్తన్ దివస్

నార్నూర్, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని త్రిరత్న బుద్ధ విహార్‌లో సోమవారం ధమ్మచక్ర పరివర్తన దినసం నిర్వహించారు. విజయనగర్ కాలనీలో సర్వమత సామూహ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.గణానందంనాయక్, విహార్ వద్ద బౌద్ధ ఉపాసకులు కేవట్ లోకండే, దీక్షాభూమి వద్ద ఆదివాసీ సంఘ రాష్ట్ర నాయకుడు మడావి మాన్కు, పంచశీల ధ్వజారోహణ చేశారు. లార్డ్ బుద్ధ సొసైటీ జాతీయ ప్రధాన కార్యదర్శి బాలాజీ కాంబ్లే మాట్లాడుతూ బుద్ధుడి అడుగుజాడల్లో నడవాలని సూచించారు.

'ఎమ్మెల్యేపై కంది వ్యాఖ్యలు సరికావు'

ఆదిలాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: దసరా వేడుకలకు మున్సిపల్ ఛైర్మన్ జోగు ప్రేమేందర్‌ను పిలవలేదని ఎమ్మెల్యే పాయల్ శంకర్‌పై కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కంది శ్రీనివాసరెడ్డి చేసిన వ్యాఖ్యలు సరికావని భాజపా జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానంద్ అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దసరా ఉత్సవ ఆహ్వాన పత్రికలో మున్సిపల్ ఛైర్మన్ పేరు ఉందని పేర్కొన్నారు. నాయకులు ధర్మపాల్, గోవర్ధన్, నాందేవ్, మహేందర్, అశోక్, సునీల్, పొచ్చన్న, ఆదెల్లు, విజయ్, కిశోర్ పాల్గొన్నారు.

ఆదిలాబాద్ అర్బన్: మున్నూర్‌కాపు కులానికి చెందిన నాయకులను గతంలో కంది శ్రీనివాసరెడ్డి అవమానించి ఇప్పుడు ప్రేమ కురిపిస్తే ఎవరూ నమ్మే ప్రసక్తే లేదని భాజపా నాయకుడు సంతోష్ అన్నారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాజీ మంత్రి జోగు రామన్న, మున్సిపల్ ఛైర్మన్ జోగు ప్రేమేందర్, గంధ్రత్ సుజాతపై చేసిన అభ్యంతరకర వ్యాఖ్యలు ఎవరూ మర్చిపోరన్నారు.

'ఇందిరమ్మ కమిటీలు రద్దు చేయాలి'

ఇంద్రవెల్లి: ఇందిరమ్మ కమిటీల ఎంపిక ప్రక్రియ సరి కాదని ఆదివాసీ సేన మండల శాఖ కన్వీనర్ మెస్రం సుదర్శన్ అన్నారు. సోమవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేయవద్దని వినతి పత్రం అందజేశారు. ఏజెన్సీ ప్రాంతంలో పెసా చట్టం ప్రకారం లబ్ధిదారులను ఎంపిక చేయాలన్నారు.

గుడిహత్నూర్: కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇందిరమ్మ కమిటీ ఎంపిక ప్రక్రియను నిలిపి వేయాలని ఆదివాసీ సేన మండల అధ్యక్షుడు సేడ్మకి భీరావ్ సోమవారం ఎంపీడీవో దిలీప్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఏజెన్సీ ప్రాంతంలో లబ్ధిదారుల ఎంపిక పెసా గ్రామ సభలకే ఉంటుందన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు

ఉట్నూరు, న్యూస్‌టుడే: ఏజెన్సీలోని గిరిజనుల సమస్యలు పరిష్కారానికి సంబంధిత అధికారులు త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా అన్నారు. సోమవారం ఉట్నూరు ఐటీడీఏలో అర్జీలు స్వీకరించారు. ఉట్నూరు మండలం బోయపాలకు చెందిన ఆనసూయ తనకు ఉద్యోగం ఇప్పించాలని, గాదిగూడ మండలం ధర్మూగూడ వాసులు పాఠశాల భవనంతోపాటు రైతులకు వ్యవసాయానికి మోటార్లు మంజూరు చేయాలని కోరారు. ఇచ్చోడకు చెందిన అర్చన తనకు ఉద్యోగం ఇప్పించాలని విన్నవించారు. అనంతరం కొత్తగా ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులను సన్మానించారు.


తాంసి వాగులో విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న మహిళలు


ఇంద్రవెల్లి : దుర్గాదేవి మండపం వద్ద భక్తులు

వేడుకగా దుర్గమ్మ నిమజ్జనం

తాంసి, ఇంద్రవెల్లి న్యూస్‌టుడే: శారదా మాత నిమజ్జనాలు సోమవారం ఉదయం ఘనంగా జరిగాయి. తాంసి, కప్పర్ల, బండల్‌నాగాపూర్, పొన్నారి, జామిడి, వడ్డాడి, హస్నాపూర్, గిరిగామ్ గ్రామాల్లో అమ్మవారి విగ్రహాలను ఊరేగించారు. ఆదివారం రాత్రి ప్రారంభమైన శోభాయాత్ర సోమవారం ఉదయం వరకు కొనసాగింది. అనంతరం ప్రత్యేక పూజలు చేసి గ్రామ సమీప వాగుల్లో నిమజ్జనం చేశారు.


తాంసి: భక్తి పాటలకు నృత్యం చేస్తున్న మహిళలు


నృత్యం చేస్తున్న ఎస్సై

వేడుకలో నృత్యాలు చేసి..

బేల, న్యూస్‌టుడే: బేల ఎస్సై రాధిక, ట్రైనీ ఎస్సై పూజ మహిళలతో కలిసి ఆడిపాడి సందడి చేశారు. పొనాలలో శారదాదేవి నిమజ్జనంలో భాగంగా బందోబస్తు పర్యవేక్షణకు గ్రామానికి వెళ్లిన ఎస్సై అక్కడ మహిళలు భజనపాటలతో తాళాలు వేస్తూ నృత్యం చేయగా వారితో జత కలిసి స్టెప్పులు వేసి వారిలో మరింత ఉత్సాహం నింపారు.

ఇంద్రవెల్లి: దస్నాపూర్ గ్రామంలోని నవరాత్రి ఉత్సవాల్లో ప్రతిష్ఠించిన దుర్గాదేవికి సోమవారం ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ప్రత్యేక పూజలు చేశారు. దస్నాపూర్ పంచాయతీ కేంద్రంతోపాటు అనుబంధ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని అన్నారు.

డీఎస్పీకి అతి ఉత్కృష్ట పతకం

★ మరో 11 మంది పోలీసులకు.. ఆరుగురికి ఉత్కృష్ట పతకాలు

ఆదిలాబాద్ నేర విభాగం, న్యూస్‌టుడే: ఆదిలాబాద్ జిల్లాలో 2024 సంవత్సరానికి ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డికి ప్రభుత్వం అతి ఉత్కృష్ట పతకం ప్రకటించింది. డీఎస్పీ జీవన్‌రెడ్డి అయిదేళ్ల కిందట సైతం ఉత్కృష్ట పతకం అందుకున్నారు. అదే విధంగా ఆదిలాబాద్‌కు చెందిన జాదవ్ సుభాష్(ఏఎస్ఐ ట్రాఫిక్), మొహ్మద్ ఖైసర్(ఏఎస్ఐ ఆదిలాబాద్), కొండూరి రమేష్(ఏఎస్ఐ), బి.రవీందర్ రెడ్డి(హెచ్‌సీ), టి.విజయ్‌కుమార్(హెచ్‌సీ), పుట్టపాక స్వామి(హెచ్‌సీ డీఎస్‌బీ), పవార్ ధన్‌లాల్(హెచ్‌సీ), అబ్దుల్ అలీం(ఏఆర్ హెచ్‌సీ), ఎం.సత్యనారాయణ(ఏఆర్ హెచ్‌సీ), ఈ.సుదర్శన్(పీసీ గాదిగూడ), వన్నల గంగారెడ్డి(ఏఎస్ఐ బోథ్)లకు అతి ఉత్కృష్ట పతకాలు వరించాయి. 25 సంవత్సరాలపాటు ఉత్తమ సేవలందించిన వారికి ఈ పతకాలను ప్రభుత్వం ప్రకటించింది. ఉత్కృష్ట పతకాలు అందుకున్న వారిలో అల్లూరి ప్రకాష్ రెడ్డి(పీసీ మహిళా పీఎస్), పిప్పరివార్ లక్ష్మణ్‌రావు(పీసీ మావల), దర్శన భూమన్న(ఏఆర్‌పీసీ), రాఠోడ్ రామారావు(ఏఆర్ పీసీ), పవార్ శేష్‌రావు(పీసీ ఏఆర్), మెడిపల్లి ముకుంద్(ఏఆర్‌పీసీ) ఉన్నారు. పదిహేను సంవత్సరాలపాటు ఉత్తమ సేవలు అందించిన వారికి ఉత్కృష్ట పతకాలు అందిస్తారు.


ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి

దళారులను నమ్మి మోసపోవద్దు

ఇంద్రవెల్లి, న్యూస్‌టుడే: ఆరుగాలం కష్టపడి పండించిన పంట అమ్ముకునే సమయంలో దళారులను రైతులు నమ్మి మోసపోవద్దని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. సోమవారం ఇంద్రవెల్లి మార్కెట్ యార్డులో ప్రభుత్వపరంగా సోయాబీన్ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వ రైతుల సంక్షేమం కోసం పని చేస్తుందని గుర్తు చేశారు. ప్రభుత్వం తరఫున క్వింటా రూ.4,892కు కొనుగోలు చేస్తుందని అన్నారు. పీఏసీఎస్ ఛైర్మన్ మారుతి డొంగ్రె, మార్కెట్ కార్యదర్శి దేవన్న, పీఏసీఎస్ కార్యనిర్వాహక అధికారి ధరం సింగ్, కాంగ్రెస్ మండలశాఖ అధ్యక్షుడు ముకాడే ఉత్తం పాల్గొన్నారు.


ఇంద్రవెల్లిలో సోయా పంట కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

డిగ్రీ కళాశాలల నిరవధిక బంద్

బేల, న్యూస్‌టుడే: మూడేళ్ల నుంచి ఫీజు రియింబర్స్‌మెంట్ రాకపోవడంతో ప్రైవేటు కళాశాలల నిర్వహణ భారంగా మారిందని బేలలోని కీర్తన డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా.వరప్రసాద్ అన్నారు. సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సంఘం పిలుపు మేరకు డిగ్రీ కళాశాలను నిరవధిక బంద్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి పెండింగ్‌లోని బిల్లులను చెల్లించాలని కోరారు. వైస్ ప్రిన్సిపల్ గెడం ప్రవీణ్, అధ్యాపకులు పుష్ప, ప్రియాంక, సౌందర్య తదితరులు పాల్గొన్నారు.

బోథ్: బోథ్‌లోని వాగ్దేవి డిగ్రీ కళాశాలను సోమవారం యాజమాన్యం మూసివేసి నిరవధిక బంద్ పాటించారు. రాష్ట్రంలోని ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలల సంఘం పిలుపు మేరకు బంద్ పాటిస్తున్నట్లు కరస్పాండెంట్ రాజశేఖర్ పేర్కొన్నారు.

పాలనాప్రాంగణం: ప్రైవేటు డిగ్రీ కళాశాలలు సోమవారం నుంచి మూతపడ్డాయి. ప్రభుత్వం మూడేళ్లుగా బోధనరుసుంల బకాయిలు చెల్లించకపోవడంతో నిరవధిక బంద్ పాటిస్తూ కళాశాలలు మూసివేస్తున్నట్లు నోటీసుబోర్డులపై బ్యానర్లు ప్రదర్శించారు. జిల్లావ్యాప్తంగా ఉన్న దాదాపు 20కిపైగా కళాశాలలు తెరుచుకోలేదు.


బోథ్‌లోని వాగ్దేవి డిగ్రీ కళాశాలను మూసివేసిన యాజమాన్యం

పంట నష్టపరిహారం చెల్లించాలని నిరసన

ఉట్నూరు గ్రామీణం, న్యూస్‌టుడే : శ్యాంపూర్ క్లస్టర్‌లో వర్షాలతో పంటలు కొట్టుకుపోయిన బాధిత రైతులందరికీ నష్టపరిహారం అందించాలని రైతులు శ్యాంపూర్‌లో రోడ్డుపై ధర్నా చేశారు. దీంతో వందలాది వాహనాలు నిలిచిపోయాయి. వంద మంది నష్టపోతే 40 మందికి పరిహారం రావడం దారుణమన్నారు. ఇంద్రవెల్లి వైపు వెళ్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు రైతుల వద్దకు వెళ్లి మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. దీంతో రైతులు ధర్నాను విరమించారు. ఉట్నూరు ఎస్సై మనోహర్, ఏఎస్సై దిలీప్ వాహన చోదకులకు ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా చూశారు.


రోడ్డుపై ఆందోళన చేస్తున్న రైతులు


లేఖలతో ముఖరా(కె) గ్రామస్థులు

ఆరు గ్యారంటీలు అమలు చేయాలి

ఇచ్చోడ, న్యూస్‌టుడే : కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని ముఖరా(కె) గ్రామస్థులు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, రేవంత్‌రెడ్డిలకు ఉత్తరాలు పంపి నిరసన తెలిపారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 300 రోజులు గడుస్తున్నా ఇంకా అమలు కావడం లేదని, ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. మాజీ సర్పంచి గాడ్గె మీనాక్షి, నాయకులు గాడ్గె సుభాష్, అర్చన, రేణుక, ఇందూబాయి, తిరుపతి, మారుతి, శ్రీరాం తదితరులు ఉన్నారు.

తాత్కాలిక రోడ్డు పనుల పరిశీలన

జైనథ్, న్యూస్‌టుడే: మండలంలోని తరోడ(బి) వద్ద కొట్టుకుపోయిన తాత్కాలిక రోడ్డు మరమ్మతు పనులను ఎమ్మెల్యే పాయల్ శంకర్ సోమవారం పరిశీలించారు. భోరజ్ నుంచి మహారాష్ట్ర వరకు రోడ్డు నిర్మాణ పనులు జూన్, జులై నెలలో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. తరోడ వంతెన వద్ద రూ.4.5 కోట్లతో నిర్మిస్తున్న డైవర్షన్ రోడ్డు పనులు మరో రెండు నెలలు అయ్యే అవకాశం ఉందని అధికారులు ఎమ్మెల్యేకు వివరించారు. మరో నాలుగు రోజుల్లో రాకపోకలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.


తరోడ(బి) వంతెన వద్ద రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

రక్తదానంతో మనిషికి ప్రాణం పోసినట్టే: ఎమ్మెల్యే

బోథ్, న్యూస్‌టుడే: రక్తదానం చేస్తే ఓ మనిషికి ప్రాణం పోసినట్లేనని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. బోథ్ మండలం కౌఠ గ్రామంలో స్వామి వివేకానంద యువజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. 60కిపైగా యువకులు రక్తదానం చేశారు. గ్రామంలో గ్రంథాలయ నిర్మాణానికి కృషి చేస్తానని, గ్రామంలో అంతర్రాష్ట్ర రహదారి నుంచి గ్రామం చివర వరకు రహదారి నిర్మించేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. అంతకుముందు పిప్పిల్‌దరి మాజీ సర్పంచి శ్రీధర్‌రెడ్డి చిన్నమ్మ నడిపమ్మ మృతి చెందటంతో కుటుంబ సభ్యులను, కౌఠలో పలు కుటుంబాలను పరామర్శించారు.


రక్తదాన శిబిరంలో ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

అమరవీరుల వారోత్సవాలకు ఏర్పాట్లు

ఆదిలాబాద్ నేర విభాగం, న్యూస్‌టుడే: ఈ నెల 21 నుంచి పోలీసు అమరవీరుల వారోత్సవాలను నిర్వహించటానికి పోలీసుశాఖ ఏర్పాట్లు ముమ్మరం చేసింది. ఈ మేరకు వివరాలను ఎస్పీ గౌష్ ఆలం సోమవారం ఇక్కడ విడుదల చేశారు. 21న ఫ్లాగ్‌డేను పురస్కరించుకొని పోలీసు హెడ్‌క్వార్టర్‌లోని అమరవీరుల స్తూపం వద్ద నివాళులు అర్పించనున్నట్లు, అమరుల కుటుంబాలకు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. 25న సైకిల్ ర్యాలీ, 26న మెగా రక్తదాన శిబిరం, అన్ని పోలీసు స్టేషన్‌లలో పోలీసుల విధులు, వినియోగించే ఆయుధాల గురించి ఓపెన్ హౌజ్ కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. ఔత్సాహికులు పోలీసుల సేవలు, మూఢ నమ్మకాలు, సామాజిక రుగ్మతలు తదితరాలపై మూడు నిమిషాలకు తగ్గకుండా వీడియోలను రూపొందించి 23 వరకు జిల్లా పోలీసు కార్యాలయంలో అందించాలన్నారు.

పురుగుమందు తాగి ఇద్దరు ఆత్మహత్య

ఉట్నూరు గ్రామీణం, న్యూస్‌టుడే : ఉట్నూరు మండలంలో వేర్వేరు ఘటనల్లో ఇద్దరు పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు.

మానసిక స్థితి సరిగ్గా లేక ..

ఉట్నూరు మండలం పెద్దగంగాపూర్‌కు చెందిన చెలుకల శ్రీనివాస్(30) పురుగుమందు తాగి రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఉట్నూరు ఎస్సై మనోహర్ తెలిపిన వివరాల ప్రకారం శ్రీనివాస్ వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కొన్ని రోజుల నుంచి మానసిక స్థితి బాగా లేదు. అయిదు రోజుల కిందట ఇంట్లో పురుగుమందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఉట్నూరు ఆసుపత్రికి, మెరుగైన వైద్యం కోసం రిమ్స్‌కు తరలించారు. అక్కడి చికిత్స పొంది రెండు రోజుల కిందట ఇంటికి తిరిగి వచ్చారు. ఆదివారం రాత్రి ఆరోగ్యం బాగా లేకపోవడంతో కుటుంబ సభ్యులు ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్టు తెలిపారు. శ్రీనివాస్‌కు అదే గ్రామానికి చెందిన యువతితో వివాహం అయింది. వీరికి ఇద్దరు సంతానం. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై మనోహర్ తెలిపారు.


శ్రీనివాస్

కడుపునొప్పి భరించలేక ..

ఉట్నూరు మండలం మత్తడిగూడ పంచాయతీ పరిధి దుర్గాపూర్‌కు చెందిన ఆదివాసీ యువతి కడుపునొప్పి భరించలేక పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఉట్నూరు ఎస్సై మనోహర్ తెలిపిన వివరాల ప్రకారం దుర్గాపూర్‌కు చెందిన తొడసం మంజులత(23) డిగ్రీ మధ్యలో ఆపేసి తల్లిదండ్రులకు వ్యవసాయ పనుల్లో చేదోడువాదోడుగా ఉంటోంది. కడుపునొప్పి భరించలేక ఆదివారం రాత్రి ఇంట్లో పురుగుమందు తాగి పడిపోయింది. గమనించిన కుటుంబ సభ్యులు ఉట్నూరు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై పేర్కొన్నారు.


మంజులత

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

ఆదిలాబాద్ నేర విభాగం, న్యూస్‌టుడే: ఆదిలాబాద్ వన్‌టౌన్ పరిధి శాంతినగర్‌లో ఓ యువకుడు అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన సోమవారం వెలుగు చూసింది. వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు ఆ కాలనీలో నివాసం ఉండే వట్టంవార్ మణికంఠ(30) పట్టణంలో దుస్తుల వ్యాపారం చేస్తుంటాడు. ఆదివారం భైంసాలోని శుభకార్యానికి కుటుంబ సభ్యులతోపాటు ఆయన భార్య ప్రణిత ఉదయం ఆరున్నర గంటలకు వెళ్లారు. రాత్రి ఇంటికి తిరిగిరాగా తలుపు లోపల నుంచి గడియ పెట్టి ఉంది. ఎంత పిలిచినా తలుపు తీయకపోవటంతో వెనుక వైపున కిటికీ పగులగొట్టి వెళ్లి చూడగా హాలులో మణికంఠ పడి ఉన్నాడు. ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుని తండ్రి వట్టంవార్ గంగాధర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఇసాఖ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. అతను విషం తాగి మృతి చెందాడా? గుండెపోటుతో మృతి చెందాడా? అనే విషయం శవ పరీక్ష నివేదికలో తెలుస్తుందని సీఐ వివరించారు.


మణికంఠ

ఎట్టకేలకు కేసు నమోదు చేసిన జీఆర్‌పీ పోలీసులు

ఆదిలాబాద్ నేర విభాగం, న్యూస్‌టుడే: ఆదిలాబాద్ రైల్వేస్టేషన్‌లో ఆదివారం పట్టుబడ్డ తంబాకు పొట్లాల విషయంలో ఎట్టకేలకు జీఆర్‌పీ పోలీసులు కేసు నమోదు చేశారు. ఆదివారం ఉదయం రైలులో నుంచి దాదాపు రూ.7.20 లక్షల విలువ చేసే తంబాకు పొట్లాలను ఆదిలాబాద్‌కు చెందిన అఫీష్ అనే వ్యాపారి దిగుమతి చేసుకున్నాడు. రైల్వే స్టేషన్‌లో ఆ నిల్వలను సదరు వ్యాపారి దింపగానే సమాచారం అందుకున్న ఆదిలాబాద్ పోలీసులు అక్కడకు చేరుకున్నారు. అయితే అది రైల్వే పరిధి కావటంతో ఆ నిల్వలను జీఆర్‌పీ పోలీసులకు అప్పగించారు. ఆ తంబాకు పాకెట్లు నిషేధితమైనవి కావని వ్యాపారి వాదించటంతో జీఆర్‌పీ పోలీసులు కేసు నమోదు చేయాలా? వద్దా? అనే మీమాంసలో దినమంతా గడిపారు. ఎట్టకేలకు నిజామాబాద్‌లోని పై అధికారి ఆదేశానుసారం కేసు నమోదు చేశారు. అహ్మదాబాద్ నుంచి ఆదిలాబాద్‌కు నిషేధిత తంబాకు పొట్లాలను తరలించినట్లు జీఆర్‌పీ ఎస్ఐ సాయిరెడ్డి తెలిపారు. సదరు వ్యాపారిపై కేసు నమోదు చేసి వాటిని భద్రపర్చినట్లు పేర్కొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీ

★ యువకుడి దుర్మరణం

ఘట్‌కేసర్, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఓ యువకుడిని గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఘట్‌కేసర్ ఎస్సై ప్రభాకర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన గట్టుసాయి ఇంద్రనీల్‌గౌడ్(31) తొమ్మిది నెలల క్రితం జీవనోపాధికి ఘట్‌కేసర్ మండలం అవుషాపూర్‌కు వచ్చాడు. ఓ హోటల్‌లో పని చేస్తున్నారు. సోమవారం ద్విచక్రవాహనంపై ఘట్‌కేసర్‌కు వచ్చాడు. ఇండియన్ పెట్రోల్‌బంక్ వద్ద అతివేగంగా వచ్చిన గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోగా అక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


ఇంద్రనీల్‌గౌడ్

దుర్గాదేవి నిమజ్జనంలో అపశ్రుతి

● పెన్‌గంగలో పడి ఒకరి గల్లంతు

జైనథ్, న్యూస్‌టుడే : దుర్గాదేవి నిమజ్జనం చేస్తుండగా సోమవారం అపశ్రుతి చోటుచేసుకుంది. పట్టణంలోని రణదివేనగర్ కాలనీకి చెందిన గజు(35) అనే యువకుడు జైనథ్ మండలం డొల్లార సమీపంలోని పెన్‌గంగ నదిలో దుర్గాదేవి విగ్రహం నిమజ్జనానికి వెళ్లాడు. విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు నదిలో పడి గల్లంతయ్యాడు. ఈ ఘటనతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది. ఆ యువకుడి కోసం పోలీసులు గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు ముమ్మరంగా చేపట్టారు.


గజు

ఫోన్ మాట్లాడతానని చెప్పి చరవాణితో పరారీ

ఆదిలాబాద్ నేర విభాగం, న్యూస్‌టుడే: అత్యవసరంగా ఫోన్ మాట్లాడాల్సి ఉందని చెప్పి నమ్మించి చరవాణి తీసుకొని ఓ వ్యక్తి పరారైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కొత్త హౌజింగ్‌బోర్డు కాలనీకి చెందిన సామ సతీష్‌రెడ్డి అనే వ్యక్తి ఆదివారం సాయంత్రం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉండగా గుర్తు తెలియని వ్యక్తి వచ్చి 'కొంచెం ఫోన్ మాట్లాడాలి. . ఇవ్వండని' ప్రాధేయపడి తీసుకున్నాడు. అనంతరం ఫోన్ మాట్లాడుతూ చరవాణి తీసుకొని పరారయ్యాడు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు పేర్కొన్నాడు. టూటౌన్ సీఐ కరుణాకర్‌రావును సంప్రదించగా ఫిర్యాదు అందిందన్నారు.

వివేక్ వెంకటస్వామిని పార్టీ నుంచి బహిష్కరించాలి

ఎదులాపురం, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణ విషయంలో వివేక్ వెంకటస్వామి ఆదివారం చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లేష్ పేర్కొన్నారు. సోమవారం మాట్లాడుతూ మాలలకు భయపడి సీఎం పదవి పోతుందని రేవంత్‌రెడ్డి ఎస్సీ వర్గీకరణ విషయమై వివేక్‌తో అలా మాట్లాడించారని ఆరోపించారు. వర్గీకరణకు వ్యతిరేకంగా మాట్లాడిన వివేక్‌ను పార్టీ నుంచి బహిష్కరించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వైఖరిని నిరసిస్తూ ఈ నెల 16న నిజామాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్ర సదస్సులో భవిష్యత్తు కార్యాచరణ ప్రకటించనున్నట్లు పేర్కొన్నారు. బేడ బుడగజంగం జిల్లా ప్రతినిధి గంగన్న, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్, సూర్యకాంత్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లేష్

రాజీనామా కోరే హక్కు లేదు

ఆదిలాబాద్ అర్బన్: చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్‌ను రాజీనామా చేయాలని కోరే హక్కు ఎమ్మార్పీఎస్ నాయకులకు లేదని మాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కొప్పుల రమేశ్ అన్నారు. సోమవారం సంఘం భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో మాలల జనాభాను తక్కువ చేసి చూపిస్తున్నారని ఆరోపించారు. వర్గీకరణ రాజ్యాంగబద్ధంగా జరగాలని, ఖచ్చితమైన జనాభా లెక్కలు తేల్చాలని డిమాండ్ చేశారు. ఆ సంఘం నాయకులు రాఘవేంద్ర, రాజు, రఘు, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

బదిలీ ఉపాధ్యాయులను రిలీవ్ చేయండి

పాలనాప్రాంగణం: బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలని తపస్ అధ్యక్ష, కార్యదర్శులు సునీల్‌చవాన్, వి.గోపికృష్ణ కోరారు. ఈ మేరకు సోమవారం డీఈవో ప్రణీతను కలిసి విన్నవించారు.

సభ్యత్వ నమోదు వేగవంతం కావాలి

ఇచ్చోడ: భాజపా సభ్యత్వ నమోదు వేగవంతం కావాలని రాష్ట్ర సంఘటన మంత్రి చంద్రశేఖర్ అన్నారు. ఇచ్చోడలోని ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రతి బూత్‌లో 200, మండలంలో 10 వేల సభ్యత్వ నమోదు చేయాలన్నారు.

ప్రజాభీష్టం మేరకే ఉత్సవాలు

ఎదులాపురం: ప్రజల అభీష్టం మేరకే స్థానిక డైట్ మైదానంలో దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించామని సనాతన హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు ప్రమోద్‌కుమార్ ఖత్రీ పేర్కొన్నారు. స్థానిక పాత్రికేయ ప్రాంగణంలో సోమవారం మాట్లాడారు. తమ సమితి ఏ పార్టీకి అనుబంధంగా లేదని హిందూ పండగలు సంప్రదాయబద్ధంగా నిర్వహించటం, వారిలో ఐక్యత పెంపొందించటమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు పేర్కొన్నారు.